సాక్షి నిర్మల్

మంగళవారం ; 24 ; జనవరి ; 2023



బాసరకు 'వసంత' శోభ 10లో▸

వసంత పంచమి వేడుకలకు బాసర ముస్తాబైంది. మంగళవారం నుంచి వేడుకలు మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



భక్తుల కొంగుబంగారం..సాయి

గౌతమి గోదావరి తీరంలో ఖానా పూర్ సాయి బాబా ఆలయం అభినవ షిర్డీగా పేరు గాంచింది. ఆలయ 26వ వార్షికోత్సవాలు ఈనెల 17 నుంచి వైభవంగా నిర్వహిస్తున్నారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం 32.1 /17.8

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు కాస్త పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండగా అనిపిస్తుంది. రాత్రి చలి ప్రభావం చాలావరకు తగ్గుతుంది.

న్యూస్‌రీల్

మెరుగైన పోలీసింగ్‌కు చర్యలు



అర్జీదారుని సమస్య వింటున్న ఎస్పీ

నిర్మల్‌టౌన్: జిల్లా ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. క్యాంప్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎస్పీ వారి సమస్యలు తెలుసుకుని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సామాన్యులకు అండగా ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసుల సహాయం కావాలనుకునేవారు తాణాలో నిర్భయంగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నాయని తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. జిల్లా వాట్సాప్ నంబర్ 8712659599కు అయినా సమాచారం ఇవ్వాలని తెలిపారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి



విద్యార్థులతో ఆర్‌సీవో గోపీచంద్

లక్ష్మణచాంద:పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ గోపీచంద్ సిబ్బందికి సూచించారు. మండలంలోని రాచాపూర్‌లోని ఎంజేపీ పాఠశాల, కళాశాలను సోమవారం తనిఖీ చేశారు. పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు పెన్నులు అందజేశారు. ఇటీవల సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంటికి వెళ్లిన కొందరు విద్యార్థులు ఇంకా తిరిగి రాకపోవడంతో వెంటనే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ సంతోష్, ఏటీపీ సురేశ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ఈనెల 25న జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ముషరఫ్ అలీ అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో సంబంధిత అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఓటర్ దినోత్సవం రోజు ఉదయం ర్యాలీలు నిర్వహించి ఓటు హక్కుపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించాలని తెలిపారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

ఈ నెల 26న నిర్వహించే గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎస్పీ ప్రవీణ్‌కుమార్, అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి వేడుకల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పోలీస్ బందోబస్తు నిర్వహించాలని పేర్కొన్నారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మంత్రి అలా.. చైర్మన్ ఇలా!



కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న రైతులు

- 'మాస్టర్‌ప్లాన్‌'పై విరుద్ధ ప్రకటనలు
- ముసాయిదా రద్దుపై సందిగ్ధం..?
- కలెక్టరేట్, మున్సిపాలిటీ మీదుగా మంత్రి వద్దకు పంచాయితీ
- మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్ ఆపేశారు : 'అల్లోల'
- అభ్యంతరాల ఆధారంగా మార్పులు చేస్తాం : చైర్మన్

అయినా సందిగ్ధమే..!

మున్సిపల్ మాస్టర్‌ప్లాన్ ముసాయిదా రద్దుపై మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేసిన ప్రకటనలు విరుద్ధంగా ఉండటంతో రైతుల్లో అయోమయం నెలకొంది. జేఏసీ రైతులతోపాటు సోమవారం ఉదయం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాస్టర్‌ప్లాన్ ముసాయిదా రద్దు గురించి కాకుండా సవరణలు మాత్రమే ఉంటాయని చైర్మన్ పేర్కొన్నారు. మరోవైపు తనవద్దకు వచ్చిన రైతు జేఏసీ ప్రతినిధులతో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది కలిగించేలా ఉన్న మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్‌ను రాష్ట్రవ్యాప్తంగా ఆపేశారని ప్రకటించారు. ఇలా విరుద్ధమైన ప్రకటనలు చేయడంతో కొంత సందిగ్ధత ఉందని రైతులు పేర్కొంటున్నారు.

తక్షణమే రద్దు చేయాలి..

నిర్మల్ పట్టణ నూతన మాస్టర్ ప్లాన్‌ను తక్షణమే రద్దు చేయాలని రైతు ఐక్యకార్యాచరణ వేదిక డిమాండ్ చేసింది. కలెక్టరేట్‌కు వచ్చిన వారు మాట్లాడుతూ తమ భూములే తమకు ప్రాణమన్నారు. ఇక్కడున్న ఏ ఒక్క రైతుకు కూడా పెద్దగా భూములు లేవని, పది, ఇరవై గుంటల లోపే భూములున్న చిన్న రైతులమన్నారు. మాస్టర్ ప్లాన్ ముసాయిదాను రద్దు చేసే వరకు తమ పోరాటం కొనసాగిస్తామన్నారు. కేవలం సవరణ చేస్తామని నమ్మించి మోసం చేయొద్దని కోరారు. కామారెడ్డి, జగిత్యాలలో చేసినట్లు నిర్మల్‌లో కూడా మున్సిపల్ తీర్మానం చేసి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో ఐక్యకార్యాచరణ కమిటీ రైతులు దొంతుల రవి, కొట్టె శేఖర్, కొబ్బయ్ శేషాద్రి, అనుముల మోహన్, కొబ్బయ్ శ్రీనివాస్, ఆదుముల్ల సంతోష్, నేరెళ్ల ప్రదీప్, ఉదిగిరి పోశెట్టి, అనుముల సంతోష్, నాందేడపు శ్రీనివాస్, తోట రవి, ఒడ్నాల వెంకటరమణ, అర్కరి నర్సయ్య, కత్రోజీ గణేశ్, కూన ఈశ్వర్, కూన రవి, కిషన్‌సింగ్, దొనగిరి మురళి తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్: మాస్టర్‌ప్లాన్ ముసాయిదాపై రైతుల 'భూ పంచాయితీ' చివరకు సోమవారం కలెక్టరేట్, మున్సిపాలిటీ మీదుగా మంత్రి వద్దకు చేరింది. ఒక్క రైతుకు సంబంధించిన అంగుళం భూమికి కూడా మాస్టర్ ప్లాన్‌తో నష్టం కలుగకుండా చూస్తామని, ప్రస్తుత ముసాయిదాను రద్దు చేస్తామని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి హామీ ఇచ్చారు. లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో పోటీ కూడా చేయనని ప్రకటించారు. మరోవైపు ఉదయం బల్దియాకు వచ్చిన రైతులకు మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ ముసాయిదా రద్దు ఉండదని, అభ్యంతరాలను పరిశీలించి ప్రతిపాదనల్లో మార్పులుచేర్పులు చేస్తామని చెప్పారు. ఒకేరోజు చైర్మన్, మంత్రి విరుద్ధ ప్రకటనలు చేయడంతో రైతుల్లో సందిగ్ధం వీడలేదు.

కలెక్టరేట్‌కు వచ్చిన రైతులు..

తమ భూములను మింగేలా ఉన్న మాస్టర్‌ప్లాన్ ముసాయిదాను వెంటనే రద్దుచేయాలంటూ రైతు జేఏసీ డిమాండ్ చేసింది. స్థానిక విశ్వనాథ్‌పేటలోని బ్రహ్మంగారి ఆలయం నుంచి కిసాన్ కండువాలు వేసుకుని రైతులంతా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు బైక్‌ర్యాలీగా వచ్చారు. అక్కడి నుంచి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ప్రస్తుత మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్‌ను రద్దు చేయడమే తమ ఏకైక డిమాండ్ అని వారు పేర్కొన్నారు. రైతు ఐక్య కార్యాచరణ వేదికగా తామంతా భూముల కోసం ఈ డిమాండ్ చేస్తున్నామని కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇచ్చారు. తర్వాత వారంతా పక్కనే ఉన్న మున్సిపాలిటీకి ర్యాలీగా వెళ్లారు. ఈరెండు కార్యాలయాల గేట్ల వద్దనే పోలీసులు రైతులను అడ్డుకోవడం గమనార్హం. కలెక్టరేట్ గేటు వద్దనే అధికారికి వినతిపత్రం ఇచ్చారు.

మున్సిపాలిటీలో..

కలెక్టరేట్ నుంచి బల్దియాకు చేరుకున్న రైతులను గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ కార్యాలయం బయటకు వచ్చి, ఆవరణలోనే రైతులతో మాట్లాడారు. కొన్ని రోజులుగా చెబుతున్నట్లుగానే రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామని మళ్లీ హామీ ఇచ్చారు. ఈ విషయం మంత్రి దృష్టిలో ఉందని, ఎవరికీ నష్టం కలుగకుండా మాస్టర్‌ప్లాన్ ఉంటుందన్నారు. ముసాయిదా రద్దు కాదని, అభ్యంతరాల మేరకు ప్రతిపాదనల్లో మార్పులు మాత్రమే చేస్తారని చెప్పారు.

ఇంచు భూమి కూడా పోదు..: మంత్రి 'అల్లోల'

మాస్టర్‌ప్లాన్ ముసాయిదాలను రాష్ట్రవ్యాప్తంగా ఆపేశారని, ఇంచు భూమి కూడా పోదని, ఏదయినా ఉంటే మీటింగ్ పెట్టి ఒక్కో సర్వే నంబర్ పెట్టి, రైతులకు అడిగిమరీ చేస్తారని, రైతులకు వ్యతిరేకంగా వెళ్లే ప్రభుత్వం కాదని.. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. ఒకవేళ రైతులకు అన్యాయం జరిగేలా మాస్టర్ ప్లాన్ ఉంటే వచ్చే ఎన్నికల్లో తాను పోటీ కూడా చేయబోనని తెలిపారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్‌కు అనుగుణంగా చేసిన మార్పులతో ముసాయిదా ఇచ్చారని, ఇందులో కొన్ని అనవసరమైన ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని రద్దు చేశారని చెప్పారు. నిర్మల్‌లోనే కాదని, రాష్ట్రవ్యాప్తంగా ఆపేశారని మంత్రి తెలిపారు.



రైతులతో మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

పదోన్నతుల ప్రక్రియ షురూ

- నేడు అర్హత గల ఉపాధ్యాయుల వెరిఫికేషన్
- హాజరు కావాలని సమాచారం

నిర్మల్‌రూరల్: జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ మొదలైంది. ప్రభుత్వ, స్థానిక సంస్థల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్స్ కోసం అర్హత గల స్కూల్ అసిస్టెంట్ కేటగిరీ ఉపాధ్యాయులు మంగళవారం డీఈవో కార్యాలయంలో వెరిఫికేషన్‌కు రావాలని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి తెలిపారు. ఒరిజినల్ సర్వీస్ పుస్తకం, తగిన సర్టిఫికెట్స్‌తో ఉదయం 10:30 గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు. ప్రభుత్వ యాజమాన్య స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు, జనరల్, ఎస్సీ కేటగిరీ వారు 1999 అపాయింట్‌మెంట్ సంవత్సరం వరకు, ఎస్టీ కేటగిరీ వారు 2007 సంవత్సరం వరకు, పీహెచ్‌సీవారు అర్హత గల అందరూ ఉపాధ్యాయులు రావాలని వివరించారు. స్థానిక సంస్థల స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు జనరల్ కేటగిరీ వారు 2001 డీఎస్సీ, జనవరి 2002 వరకు, ఎస్సీ కేటగిరీ వారు 2005 వరకు, ఎస్టీ కేటగిరీ వారు 2007 వరకు, పీహెచ్‌సీ వారు అందరూ ఉపాధ్యాయులు హాజరు కావాలని వెల్లడించారు. ఉపాధ్యాయులు ఒక సెట్ జిరాక్స్ కాపీలు వెంట తీసుకురావాలని సూచించారు.

ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పోశెట్టి, నాగనాథ్

భైంసాటౌన్: భైంసాకు చెందిన బీజేపీ నాయకులు రావుల పోశెట్టి, ఎడ్ల నాగనాథ్ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎన్నికయ్యారు. భైంసాలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు రమాదేవితోపాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు వారిని సోమవారం అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్, నాయకులు సాహెబ్‌రావు, నందు భయ్యా, సంతోష్, అనిల్, లక్ష్మణ్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు పరిశీలిస్తాం

- రైతులకు మంత్రి అండగా ఉంటారు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: పట్టణ నూతన మాస్టర్ ప్లాన్‌పై ప్రజలకు, రైతులకు అభ్యంతరాలుంటే పరిశీలించి న్యాయం జరిగేలా చూస్తామని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. మాస్టర్ ప్లాన్‌పై రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. మాస్టర్ ప్లాన్ విషయంలో రైతులు ఎలాంటి అపోహలు, ఆందోళనలకు గురికావొద్దని సూచించారు. ఈ విషయాన్ని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. రైతులకు అండగా మంత్రి ఉన్నారని తెలిపారు. విశ్వనాథ్‌పేట్ నుంచి నూతన కలెక్టరేట్ వరకు 100 ఫీట్ల రోడ్డు కేవలం ప్రతిపాదన మాత్రమే అని చెప్పారు. 100, 200 ఫీట్ల రోడ్డు సాధ్యం కాదని పేర్కొన్నారు. ఒక రైతు భూమి కూడా పోదని స్పష్టం చేశారు. ప్రస్తుతం కలెక్టరేట్ నుంచి బంగల్‌పేట్, వినాయక్‌సాగర్ విశ్వనాథ్‌పేట్ వరకు ఉన్న రోడ్డును విస్తరిస్తామని తెలిపారు. మాస్టర్ ప్లాన్ ముసాయిదాపై ఫిబ్రవరి 10వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. తర్వాత రైతులు, ప్రజల అభ్యంతరాలు పరిశీలించి, మాస్టర్ ప్లాన్‌లో ఇండస్ట్రీయల్, రెసిడెన్షియల్ జోన్లలో సవరణలు చేస్తామన్నారు. ప్రజలను ఇబ్బందిపెట్టి అభివృద్ధి పనులు చేయాలనుకోవడం లేదని చెప్పారు. కొన్ని పార్టీల నాయకులు రాజకీయలబ్ధి కోసం మాస్టర్ ప్లాన్‌పై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. టీపీవో సుమలత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జంతు సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ , అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: జంతు సంరక్షణ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ముషరఫ్ అలీ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 14 నుండి నిర్వహిస్తున్న జంతు సంక్షేమ పక్షోత్సవంపై సంబంధిత అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. జంతువులపై ప్రేమ, కరుణ పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా పాఠశాలలో విద్యార్థులకు జంతు చట్టాలపై అవగాహన కలిగేలా ఉపన్యాస, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించాలన్నారు. కరపత్రాలతో ప్రచారం చేయాలని సూచించారు. అనంతరం జంతు సంక్షేమం కోసం ప్రతీ పౌరుడు విధిగా పాటించాల్సిన నిబంధనల పోస్టర్‌ను ఎస్పీ ప్రవీణ్‌కుమార్, అదనపు కలెక్టర్, పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు.

బడి బాగుకోసం 'పీఎంశ్రీ'

- జిల్లాలో 67 పాఠశాలల ప్రతిపాదన
- మండలానికి రెండు పాఠశాలల ఎంపిక
- తుది దశకు ఎంపిక ప్రక్రియ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అభివృద్ధి
- ఒక్కో పాఠశాలకు రూ.40 లక్షలు



నర్సాపూర్(జి) మండలం బూరుగుపల్లి పాఠశాలను తనిఖీ చేస్తున్న బృందం సభ్యులు

నిర్మల్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలకు ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే మన ఊరు – మన బడి కార్యక్రమంలో పనులు చేపట్టింది. మొదటి విడతగా జిల్లాలో 200కిపైగా పాఠశాలల్లో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం కూడా సర్కార్ పాఠశాలల అభివృద్ధికి ముందుకు వచ్చింది. ఈమేరకు పీఎంశ్రీ యోజన పేరుతో కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో విద్యను మరింత పటిష్టం చేసేలా ప్రణాళిక రూపొందించింది. 2023–24 విద్యా సంవత్సరం నుంచి మొదలుకానున్న ఈ పథకం కింద ఒక్కో మండలానికి రెండు చొప్పున పాఠశాలలను ఎంపిక చేస్తున్నారు. ఈ ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. జిల్లాలో 70 పాఠశాలలు దరఖాస్తు చేసుకోగా 67 పాఠశాలకు అర్హత ఉన్నట్లు అధికారులు నివేదిక పంపించారు. మండలానికి రెండు పాఠశాలలనే ఎంపిక చేసే అవకాశం ఉన్నందున ఏయే పాఠశాలలను ఎంపిక చేస్తారన్న ఆసక్తి నెలకొంది.

67 బడులు ఫైనల్ స్టేజికి...

యూ డైస్ ప్లస్ ప్రోగ్రాంలో నమోదైన సమాచారం ప్రకారం జిల్లాల వారీగా పీఎంశ్రీ పథకానికి పాఠశాలలను ఎంపిక చేసేందుకు బెంచ్ మార్క్ స్కూల్స్ పేరిట రాష్ట్ర అధికారులు జిల్లాలో మొదట 95 పాఠశాలలతో జాబితాను జిల్లాకు పంపించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 60 రకాల ప్రశ్నావళిని పూరించి పాఠశాల ఫొటోలను, పంచాయతీ తీర్మాన పత్రాలను జతచేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం, సరిపడా ఉపాధ్యాయులు, కరెంటు, లైబ్రరీ వసతి వంటి 60 అంశాలు ఫార్మాట్లో పూరించారు. వీటన్నింటినీ జిల్లా శాఖ అధికారులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. సౌకర్యాల ఆధారంగా ప్రతీ పాఠశాలకు మార్కులను కేటాయించారు .

మండలాల వారీగా ప్రతిపాదిత పాఠశాలు..

మండలం	ప్రతిపాదిత పాఠశాలలు
బాసర	02
భైంసా	05
దస్తురాబాద్	03
దిలావర్‌పూర్	02
కడెం	03
ఖానాపూర్	06
కుభీర్	06
నిర్మల్	03
సారంగాపూర్	03
సోన్	03
తానూర్	03
కుంటాల	04
లక్ష్మణచాంద	04
మామడ	05
ముధోల్	07
నర్సాపూర్(జి)	01
నిర్మల్‌రూరల్	08
మొత్తం	67

ప్రత్యేక బృందాలు..

జిల్లాలో బెంచ్ మార్కు పాఠశాలలను ఎంఈవోలు, పీజీ హెచ్‌ఎంల నేతృత్వంలోని 17 ప్రత్యేక బృందాలు మండల స్థాయిలో తనిఖీ చేశాయి. రూరల్ ఏరియాలో 60 శాతానికిపైగా వచ్చిన మార్కులను, అర్బన్ ఏరియాలో 70 శాతానికి పైగా వచ్చిన మార్పులను పరిగణలోకి తీసుకున్నారు. జిల్లాస్థాయిలో మొదట 70 పాఠశాలలను ఎంపిక చేసినా... ఆ తర్వాత క్షేత్రస్థాయిలో 67 పాఠశాలలు మాత్రమే ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. ఈ పథకం కింద ఎంపిక అయితే ప్రతీ విద్యాసంవత్సరానికి రూ.40 లక్షల మేర నాలుగేళ్ల రూ.1.60 కోట్ల మేర నిధులు విడుదలవుతాయనే ప్రచారంతో తమ పాఠశాలలు పీఎంశ్రీకి ఎంపిక కావాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుకుంటున్నారు.

మండలానికి రెండు ఎంపిక...

పీఎంశ్రీ పథకం కోసం మండలానికి రెండు పాఠశాలలను ఎంపిక చేయనున్నారు. ఇందులో ఒకటి ప్రాథమిక, మరొకటి ఉన్నత పాఠశాల ఉంటుంది. కేజీబీవీ, మోడల్, రెసిడెన్షియల్ గురుకులాలు కూడా పోటీ పడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 17 మండలాల నుంచి 67 పాఠశాలలు ఫైనలైజ్ కాగా రెండు మండలాల నుంచి దరఖాస్తులు రాలేదు. మండలానికి రెండు చొప్పున జిల్లా వ్యాప్తంగా 34 పాఠశాలలకు ఈ పథకం ద్వారా నిధులు రానున్నాయి. ఈ నిధుల్లో 60 శాతం కేంద్ర వాటా ఉండగా, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయనుంది.

ఇవీ చేపట్టే పనులు...

పీఎంశ్రీ పథకంలో ఎంపికైన పాఠశాలలను జియో ట్యాగింగ్ చేసి వాటిలో నిర్వహించే వివిధ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్షిస్తారు. నిపుణుల కమిటీ సిఫారసు మేరకు విడతల వారీగా నిధులు మంజూరు చేస్తారు. వీటితో విద్యార్థులకు అవసరమైన సాంకేతిక పరికరాలను సమకూర్చుకునే అవకాశం ఉంటుంది. ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, ఎల్‌ఈడీ లైట్లు, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు, ఆటల కోసం అవసరమైన పరికరాల కొనుగోలు, తరగతులను డిజిటల్ క్లాస్‌రూంలుగా మార్పు, 9, 10వ తరగతిలో విద్యార్థులకు ఒకేషనల్ ట్రెనింగ్ ఇచ్చి దగ్గరలో ఉన్న పరిశ్రమలో ఉపాధి, సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు పండించడం తదితర పనులు చేయిస్తారు.

త్వరలోనే తుది జాబితా..



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే పీఎంశ్రీ పథకంలో సర్కారు బడుల రూపురేఖలు మారనున్నాయి. జిల్లాలో 67 పాఠశాలలు అర్హత సాధించగా ఇందులో మండలానికి రెండు చొప్పున 34 పాఠశాలలు ఎంపిక అవుతాయి. తుది జాబితా త్వరలోనే వచ్చే అవకాశం ఉంది. – రవీందర్‌రెడ్డి, డీఈవో

వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు



పీఎంశ్రీ పథకం జిల్లా వ్యాప్తంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి మొదలుకానుంది. 17 టీంలు ఆయా పాఠశాలకు వెళ్లి తనిఖీలు నిర్వహించాయి. ఎంపికైన పాఠశాలలకు విడతల వారీగా నిధులు మంజూరవుతాయి. 2026– 27 విద్యా సంవత్సరం వరకు పథకం అమలులో ఉంటుంది. – రవిగౌడ్, ఎస్‌వో





గిరి'జన' జాతర..

పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని ఈ నెల 21న పవిత్ర గంగాజలంతో కేస్లాపూర్‌లో నాగోబాకు నిర్వహించిన మహాపూజతో ప్రారంభమైన గిరిజన జాతర సంప్రదాయబద్ధంగా సాగుతోంది. వేడుకల్లో భాగంగా మెస్రం వంశీయులు సోమవారం పెర్సపేన్, భాన్‌దేవతలకు పూజలు నిర్వహించారు. మెస్రం వంశ అల్లుళ్లు, ఆడపడుచులు వేర్వేరుగా పెర్సపేన్, భాన్‌దేవతలకు పూజలు చేశారు. మంగళవారం నిర్వహించే దర్బార్‌కు మెస్రం వంశపెద్దలు ఏర్పాట్లు చేశారు. మరోవైపు నాగోబా దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. సోమవారం తెలంగాణతోపాటు మహారాష్ట్ర, ఛతీస్‌గఢ్, ఒడిశా నుంచి తరలివచ్చిన భక్తులు నాగోబాను దర్శించుకున్నారు.

– మరిన్ని వివరాలు 8లో...

క్లుప్తంగా

'హామీలపై మంత్రి సత్యవతి స్పష్టత ఇవ్వాలి'

ఆదిలాబాద్‌రూరల్: ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా జాతరలో భాగంగా మంగళవారం నిర్వహించే దర్బార్‌కు హాజరు కానున్న రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ ఆదివాసీలకు గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై స్పష్టత ఇవ్వాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తామని ఇవ్వలేదని, జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు వాగ్దానం నిలబెట్టుకోలేదని అన్నారు. తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్ర శ్యాంరావ్, ప్రచార కార్యదర్శి వెట్టి మనోజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉయికే సంజీవ్, విద్యార్థి సంఘం అధ్యక్షుడు సలాం వరుణ్, గుడిహత్నూర్ మండల అధ్యక్షుడు వెలదీ నందు, తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం చేయొద్దని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు అర్జీలు సమర్పించారు. అదనపు కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

సారంగపూర్: మండలంలోని స్వర్ణ గ్రామం సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బోకర్ మండలం కినీకి గ్రామానికి చెందిన కోర్డెవాడ్ కృష్ణ(24) దుర్మరణం చెందాడు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణ తన స్నేహితుడు అభిలాష్‌రెడ్డితో కలిసి మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయం వద్ద తన బంధువులు చేసిన పండుగకు హాజరయ్యాడు. తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. అభిలాష్‌రెడ్డి తన ద్విచక్ర వాహనం అజాగ్రత్తగా, అతివేగంగా నడిపాడు. అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టారు. అభిలాష్‌రెడ్డి, కృష్ణ తీవ్రంగా గాయపడ్డారు. 108లో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నాందేడ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో కృష్ణ మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బ్యాంకు ఉద్యోగి ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: కుటుంబ కలహాలు, అప్పుల బాధతో ఒకరు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని నేతాజీ చౌక్‌లో చోటుచేసుకుంది. పట్టణంలోని నేతాజీచౌక్‌లో నివాసం ఉంటున్న నరేందర్(38) రాత్రి ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. హైదరాబాద్‌లోని ఎస్‌బీఐలో ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. గతంలో శివాజీచౌక్‌లోని ఎస్‌బీఐలో ఉద్యోగి చేశాడు. మృతుడికి భార్య, మూడేళ్ల కూతురు ఉంది. తండ్రి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నాగోబా దర్శనానికి బారులు తీరిన భక్తులు

నాగోబాకు మొక్కి.. పెర్సపేన్‌ను పూజించి...

- వైభవంగా కొనసాగుతున్న నాగోబా జాతర
- కొనసాగుతున్న మెస్రం వంశీయుల సంప్రదాయ పూజలు
- తరలి వస్తున్న భక్తులతో కిటకిటలాడుతున్న కేస్లాపూర్

ఇంద్రవెల్లి(ఖానాపూర్): పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని ఈ నెల 21న పవిత్ర గంగాజలంతో నాగోబాకు మహాపూజ నిర్వహించి జాతర ప్రారంభించిన మెస్రం వంశీయులు సోమవారం పెర్సపేన్, భాన్‌దేవతలకు ఘనంగా పూజలు నిర్వహించారు. భేటింగ్ అయిన కొత్తకోడళ్లు కోనేరు వద్దకు వెళ్లి పవిత్ర జలాలను తీసుకువచ్చారు. మెస్రం వంశ అల్లుళ్లు భాన్‌దేవత ఆలయం ఎదుట ఉన్న పాత పుట్టలను తొలగించడంతో మెస్రం వంశ ఆడపడుచులు పవిత్ర జలాలతో భాన్‌దేవతను శుద్ధి చేశా రు. ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు.

కొత్త కోడళ్లకు చరిత్ర బోధన

గోవడ్ వద్ద బస చేసిన మెస్రం వంశీయులు సోమవారం సంప్రదాయ వంటలు చేసి సంహపంక్తి భోజనాలు చేశారు. ప్రధాన్ కితకు చెందిన మెస్రం గంగారాం ఆధ్వర్యంలో కిక్రి వాయిస్తూ కొత్తకోడళ్లు, మెస్రం వంశ మహిళలకు నాగోబా చరిత్ర, మెస్రం వంశంలోని 22 కితల చరిత్రను బోధించారు. అనంతరం ప్రధాన్ కిత మెస్రం వంశీయులకు కొత్త కోడళ్లు, మెస్రం వంశ మహిళలు కానుకలు అందించారు.

గాయిక్ కిత మెస్రం వంశీయుల మొక్కులు

గాయికి కితకు చెందిన మెస్రం వంశీయులు సోమవారం నాగోబా ఆలయంలో ఆవుదూడను వదిలి మొక్కును చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 ఏళ్లుగా గాయికి కితలో కోడళ్లకు భేటింగ్ అయ్యే అవకాశం రాకపోవడంతో నాగోబాకు మొక్కినట్లు తెలిపారు. నాగోబా ఆశీర్వాదంతో ఈసారి తమ కితకు చెందిన కోడళ్లకు భేటింగ్ చేసే అవకాశం వచ్చిందని, 100 మందికి భేటింగ్ (పరిచయం) చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గాయిక్ కిత మెస్రం వంశ పెద్దలు శేఖర్‌బాబు, మానిక్‌రావ్, దేవ్‌రావ్, మనోహర్, జంగు, తదితరులు పాల్గొన్నారు.

నేడు నాగోబా దర్బార్

- హాజరు కానున్న మంత్రులు సత్యవతి రాథోడ్ అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



ముస్తాబైన నాగోబా దర్బార్ వేదిక

ఇంద్రవెల్లి(ఖానాపూర్): ఈ నెల 21న మెస్రం వంశీయుల మహా పూజతో ప్రారంభమైన నాగోబా జాతర కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ, మహారాష్ట్రల నుండి అధికసంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. సోమవారం విజయ డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డితో పాటు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జాతరను పురస్కరించుకుని నేడు నిర్వహించనున్న నాగోబా దర్బార్‌కు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కవిత, దండె విఠల్, జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు.

ఇదీ నాగోబా దర్బార్ చరిత్ర

నాగోబా దర్బార్‌కు ప్రత్యేక చరిత్ర ఉంది. 77 ఏళ్ల క్రితం భూమికోసం, భుక్తి కోసం, విముక్తికోసం జల్ జంగల్ జమీన్ నినాదంతో కుమురంభీం నిజాం సర్కార్‌తో పోరాటం చేశాడు. అతని పోరాటానికి ఉలికిపడ్డ నిజాం సర్కార్ ఆదివాసీ గిరిజనులపై అధ్యాయనం చేయడానికి మానవపరిణామ శాస్త్రవేత్త హైమాన్‌డార్ఫ్‌ను ఉమ్మడి ఆదిలాబాద్‌కు పంపించింది. జిల్లాకు వచ్చిన హైమాన్‌డార్ఫ్ మార్లవాయి గ్రామంలో ఉండి ఆదివాసీ గిరిజన గ్రామాల్లో పర్యటించారు. ఆదివాసీలపై అధ్యయనం చేసే సమయంలో పుష్య మాసంలో ఉమ్మడి జిల్లా మెస్రం వంశీయులంతా కేస్లాపూర్ గ్రామానికి చేరుకుని వారంరోజులు అక్కడే ఉండి నాగోబాకు పూజలు చేస్తున్న విషయం తెలుసుకున్నారు. వారి సమస్యలు, స్థితిగతులు తెలుసుకునేందుకు ఇదే మంచిస్థలంగా గుర్తించిన హైమన్‌డార్ఫ్ 1946లో నాగోబా దర్బార్ పేరుతో వారితో సమావేశమయ్యాడు. ఆక్వామే కదీం(ఆదివాసీ సంక్షేమ శాఖ కమిటీ)ని ఏర్పాటు చేశాడు. ఏటా పుష్యమాసంలో కేస్లాపూర్‌కు వచ్చి ఆదివాసీల స్థితిగతులు తెలుసుకుని నిజాం సర్కర్‌కు పంపించేవారు. అప్పటి నుంచి ఆక్వామే కదీం కమిటీ సభ్యులు, మెస్రం వంశీయులు ప్రతీ సంవత్సరం దర్బార్ నిర్వహిస్తున్నారు. 1981 ఇంద్రవెల్లి సంఘటన తర్వాత 1983 నుంచి ఏటా ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ ద్వారా అధికారికంగా దర్బార్ నిర్వహిస్తోంది. ఆదివాసీల నుంచి దరఖాస్తులు స్వీకరించి సమస్యలు పరిష్కరిస్తున్నారు. నేడు నిర్వహించనున్న దర్బార్ సమావేశానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 11 గంటలకు మంత్రులు నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం దర్బార్ సమావేశంలో పాల్గొననున్నట్లు ఆలయ ఈవో రాజమౌళి తెలిపారు.



సంప్రదాయ వాయిద్యాలతో ప్రధాన్ కిత మెస్రం వంశీయులు



పుట్టలు తయారు చేస్తున్న మెస్రంవంశ ఆడపడుచులు



లోక భూమారెడ్డిని సన్మానిస్తున్న మెస్రం వంశీయులు



కొత్త కోడళ్లకు చరిత్ర బోధిస్తున్న మెస్రం గంగారాం



ఘనంగా పూజలు

గోవడ్ నుంచి వచ్చిన మెస్రం ఆడపడుచులు, మహిళలు భాన్‌దేవతలకు పూజలు చేయగా మెస్రం వంశీయులు పక్కనే ఉన్న నాలుగు సగల పెర్సపేన్ (పెద్ద దేవుళ్ల)కు పూజలు నిర్వహించారు. గోదావరి నుంచి తీసుకువచ్చిన పవిత్ర గంగాజలంతో పెర్సపేన్ దేవుళ్లను శుద్ధిచేసి పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో మెస్రం వంశానికి చెందిన పురుషులు మాత్రమే పాల్గొన్నారు. ఈ నెల 25న గోవడ్ ముఖద్వారం వద్ద బేతల్ పూజలు చేసి మెస్రం వంశీయుల సంప్రదాయ పూజలు ముగించనున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్రావ్ తెలిపారు.

బాలిక కిడ్నాప్ కేసులో ఇద్దరికి జైలు

ఆదిలాబాద్‌టౌన్: బాలికను అపహరించిన కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ జిల్లా మొదటి అదనపు జడ్జి మాధవికృష్ణ తీర్పునిచ్చినట్లు లైజన్ ఆఫీసర్ పండరి తెలిపారు. ఆదిలాబాద్‌లోని తాటిగూడకు చెందిన మానే ప్రఫుల్ మావల మండలంలో ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. బాలిక(16)తో పరిచయం పెంచుకుని 2018 జనవరి 28న మహారాష్ట్రలోని పూణేకు తీసుకెళ్లాడు. ద్విచక్ర వాహనాన్ని ఓ సినిమా థియేటర్‌లో ఉంచాడు. పూణేలో ఉండే తన అన్నయ్య ఇంటికి తీసుకెళ్లి మూడు రోజులపాటు బంధించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇతర ప్రదేశంలో తిరిగి హైదరాబాద్‌లో వదిలి వెళ్లాడు. బాధితురాలు ఇంటికి వచ్చి కిడ్నాప్ విషయాన్ని కుటుంబీకులకు తెలుపడంతో మావల పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పీపీ రమణా రెడ్డి పది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. నిందితుడు మానే ప్రఫుల్‌కు జడ్జి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా, ఆయనకు సహకరించిన తన అన్న మానే సునీల్‌కు ఏడాది జైలుశిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

కలప పట్టివేత

కడెం: కారులో అక్రమంగా తరలిస్తున్న రూ.65 వేల విలువైన కలప పట్టుకున్నామని ఎఫ్ఆర్‌వో అనిత తెలిపారు. కారులో కలప తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు డిప్యూటీ రేంజ్ అధికారి సిద్దార్థ పాండ్వాపూర్ చెక్‌పోస్టు వద్ద ఆదివారం రాత్రి తనిఖీ చేపట్టారని పేర్కొన్నారు. కారు ఆపకుండా వెళ్లిపోవడంతో సిబ్బంది వెంబడించి మున్యాల్ గ్రామం వద్ద పట్టుకున్నారని వివరించారు. నిందితులు పారిపోయారని తెలిపారు. కారులో ఉన్న 8 దుంగలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఎఫ్‌బీవో అలీం తదితరులు పాల్గొన్నట్లు వెల్లడించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ఉట్నూర్: ప్రజావాణిలో గిరిజనుల అర్జీలను ఆయా విభాగాలుగా పరిశీలించి అర్హులైన వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఐటీడీఏ ఏపీవో జనరల్ భీంరావ్ అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాగోబా జాతర విజయవంతం అయ్యేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజావాణికి 46 అర్జీలు వచ్చాయని పేర్కొన్నారు.

కిడ్నాపర్లకు తుపాకి అమ్మిన వ్యక్తి అరెస్ట్

నిర్మల్‌టౌన్: అక్టోబర్‌లో ఒక మహిళ సహకారంతో ఆర్ఎంపీ కిడ్నాప్‌కు యత్నించి డబ్బులు డిమాండ్ చేసిన ఘటనలోని అంతర్రాష్ట్ర కిడ్నాపర్లకు తుపాకి అమ్మిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు నిర్మల్ రూరల్ సీఐ వెంకటేశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం వివరాలు వెల్లడించారు. గత అక్టోబర్‌లో నిర్మల్‌కు చెందిన ఓ మహిళ సహకారంతో కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన ఆర్ఎంపీని ప్రలోభ పెట్టి నిర్మల్‌కి రప్పించారు. కారులో వచ్చిన ఆర్ఎంపీని రెండు మోటర్ సైకిళ్లపై నలుగురు వెంబడించారు. మహారాష్ట్రలోని అటవీ ప్రాంతంలో వెళ్లిన తర్వాత తుపాకితో బెదిరించి బంధించారు. డబ్బులు డిమాండ్ చేశారు. తర్వాత ద్విచక్రవాహనంపై తీసుకెళ్తుండగా గ్రామస్తులు దొంగలుగా అనుమానించారు. వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనలో అక్టోబర్ 20న నలుగురు కిడ్నాపర్లను అరెస్టు చేశారు. వారికి తుపాకీ అమ్మిన మధ్యప్రదేశ్‌కు చెందిన రాహుల్ రజాక్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. రాహుల్ రజాక్ నిర్మల్ మీదుగా మహారాష్ట్ర వెళ్తున్నట్లు అందిన సమాచారంతో తనిఖీలు నిర్వహించి అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.



మాట్లాడుతున్న రూరల్ సీఐ వెంకటేష్

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 16 మందికి జరిమానా

లక్ష్మణచాంద: మండలంలో ఇటీవల మద్యం సేవించి వాహనాలు నడుతూ పోలీసులకు పట్టుబడిన 16 మందికి నిర్మల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జరిమానా, ఒకరికి జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. 17 మందిని సోమవారం కోర్టులో హాజరు పర్చగా 16 మందికి రూ.3,500 చొప్పున జరిమానా, ఒకరికి జైలు శిక్ష విధించినట్లు వివరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ పట్టుబడిని 9 మందికి రూ.1,890 చొప్పున జరిమానా విధించినట్లు వెల్లడించారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

కైలాస్‌నగర్: కేజీబీవీల్లో పనిచేసే నాన్ టీచింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయించుకుంటోందని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటనారాయణ, తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి దుర్గం కళావతి ఆరోపించారు. కేజీబీవీల నాన్ టీచింగ్ ఉద్యోగులకు నెలకు రూ.26వేల కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేజీబీవీ, యూఆర్ఎస్ నాన్ టీచింగ్ సిబ్బంది వేతనాలను పెరిగిన ధరలకనుగుణంగా పెంచాలని డిమాండ్ చేశారు. వారిని పర్మినెంట్ చేయాలన్నారు. ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓ.సుల్తానా, జిల్లా నాయకులు సునీత, ప్రేమల, రజిత, శ్రీవేజ, వీణ, వందన, జ్యోతి, గీత, ఆశాబాయి, నీలమ్మ, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బంది

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

- స్పెషల్ డ్రైవ్‌లో కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలి
- ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొజ్జ నారాయణ

నిర్మల్‌చైన్‌గేట్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మత్స్యకారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మత్స్య సహకార సంఘాల సమన్వయ కమిటీ సభ్యుడు డాక్టర్ బొజ్జ నారాయణముదిరాజ్, ముదిరాజ్ జేఏసీ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ శివయ్య అన్నారు. మస్కాపూర్, గోపాల్‌పేట, పీచర గ్రామాలకు చెందిన ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిర్మల్ కలెక్టర్‌తోపాటు మత్స్య శాఖ ఏడీకి సోమవారం వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 6 నుంచి ప్రభుత్వం ప్రారంభించిన స్పెషల్ డ్రైవ్ రెండో విడత కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలో మత్స్యకారులకు సభ్యత్వం కల్పించడంతోపాటు కొత్త సొసైటీల ఏర్పాటు చేయాలన్నారు. మత్స్యకారులకు సభ్యత్వంతోపాటు వివిధ నదులలో చేపలు పట్టేందుకు వీలుగా లైసెన్సులు ఇవ్వాలన్నారు. గోదావరిలో చేపలు పట్టేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లాకు చెందిన బొండ్ల రమేశ్, పంబల శేఖర్‌ముదిరాజ్ , సంతోష్‌ముదిరాజ్ , గంగాధర్‌ముదిరాజ్, పిట్టల భూమన్న, నరేందర్, భీమేశ్, చిన్నయ్య బొర్రన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో ద్వితీయ స్థానం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ సబ్ జూనియర్ హాకీ జట్టు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటింది. ఈ నెల 21నుంచి 23వరకు రంగారెడ్డి జిల్లా కేంద్రంలోని శంషాబాద్‌లో నిర్వహించిన 7వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచింది. సోమవారం మహబూబ్‌నగర్ జట్టుతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 5–0 తేడాతో రెండో స్థానం కైవసం చేసుకుంది. అంతకుముందు సెమీఫైనల్ మ్యాచ్‌లో నల్గొండ జట్టుపై 1–0 తేడాతో గెలిచి ఆదిలాబాద్ ఫైనల్‌కు చేరింది. ట్రిపుల్ ఒలింపియన్ ముఖేష్‌కుమార్, రాష్ట్ర హాకీ అసోసియేషన్ చైర్మన్ కొండ విజయకుమార్ జిల్లా జట్టుకు ట్రోఫీని బహూకరించారు. కోచ్ అతుల్‌కుమార్, మేనేజర్ శేఖర్ సీనియర్ క్రీడాకారులు రవి, అజాజ్, పంకజ్, డేవిడ్ ఉన్నారు. క్రీడాకారులను ఐటీడీఏ పీఓ కే.వరుణ్‌రెడ్డి, డీడీటీడబ్ల్యూ దిలీప్‌కుమార్, డీవైఎస్‌ఓ వెంకటేశ్వర్లు, జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.గోవర్ధన్‌రెడ్డి, పార్థసారథి అభినందించారు.



ట్రోఫీ అందుకుంటున్న జిల్లా హాకీ క్రీడాకారులు

బ్రిడ్జిపై లారీ బోల్తా

నేరడిగొండ: మండలంలోని కుప్టి బ్రిడ్జిపై సోమవారం ఉదయం ఓ లారీ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఆగ్రా నుంచి హైదరాబాద్‌కు పాల పౌడర్ బ్యాగుల లోడ్‌తో వెళ్తుండగా ప్రమాదం జరిగింది. లారీ డ్రైవర్ కుల్దీప్, క్లీనర్ సోను స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఆ దారి గుండా కొంతసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్సై సాయన్న రాకపోకలకు అంతరాయం లేకుండా చూశారు.

మున్సిపల్ స్థల ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కైలాస్‌నగర్: మున్సిపల్ స్థలాన్ని కబ్జా చేసి, చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని టీఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్‌లో మున్సిపల్ స్థలానికి కొంతమంది నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, సెల్ఫ్ అసెస్‌మెంట్ చేసుకుని అందులో అక్రమ నిర్మాణాన్ని ప్రారంభించారన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి ఆ స్థలాన్ని మున్సిపల్ ఆధీనంలోకి తీసుకునేలా చూడాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్‌కుమార్, అధికార ప్రతినిధి నక్క రాందాస్, మల్యాల స్వామి, లింగంపల్లి ప్రసన్నరావు, తదితరులు ఉన్నారు.

అక్రమ లేఅవుట్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

కై లాస్‌నగర్: పట్టణంలోని ఖానాపూర్ కాలనీలో అక్రమంగా ఏర్పాటు చేసిన లేఅవుట్‌పై చర్యలు తీసుకోవాలని యాంటి కరప్షన్ బోర్డు రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాహిద్ అలీ కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కోరారు. ఖానాపూర్‌లోని సర్వే నెంబర్ 273/1/1 , 273/1/2 , 273/1/6లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్ ఏర్పాటు చేశారన్నారు. దానిపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు